రేపు రక్తదాన శిబిరం

కడ్తాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా 21వ తేదీన (సోమవారం) కడ్తాల పోలీస్ స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సీఐ శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో యువతీ యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. రక్తదాన శిబిరానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డుపైనే ధాన్యం ఆరబోత

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
కేశంపేట మండలంలో పలువురు మృత్యువాత
రైతులకు అవగాహన కల్పించాలంటున్న ప్రజలు



8

రాతమారని కడ్తాల

పూర్తికాని మండల పరిషత్ భవన నిర్మాణం
డెయిరీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమెప్పుడో?
హామీలకే పరిమితమైన జూనియర్ కాలేజీ,
బస్టాండ్, ఆస్పత్రుల నిర్మాణం



7

చిత్తడిగా మార్కెట్ దారి

కూరగాయల క్రయ విక్రయాలకు ఇబ్బంది
రోడ్డుపై గోతుల్లో నిలిచిన బురద
కనీసం నడవలేని పరిస్థితి
షాద్‌నగర్ షాహీ గార్డెన్ ఎదుట దుస్థితి



6

రోడ్డుపై పొగాకు అమ్ముకొని జీవిస్తున్నాం

ఈ చేనేత కార్మికుడి పేరు అంజయ్య. వయస్సు 64ఏళ్లు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబం 30 ఏళ్లకు పైగా చేనేత బట్టలు నేసి సొంతంగా వ్యాపారం నిర్వహించేది. అందులోనే లాభాలను గడిస్తూ దర్జాగా బతికేవారు. కాలక్రమేణా వస్త్ర వ్యాపారంలోకి కార్పొరేట్ సంస్థలు రావడంతో వారి జీవనోపాధి దెబ్బతిన్నది. దీంతో పూట గడవడం కూడా కష్టంగా మారింది. కొన్నాళ్ల పాటు కూలి చేస్తూ కుటుంబాన్ని పోషించుకున్నారు. ఆ పనులు కూడా దొరకడం కష్టమైంది. దీంతో ఆయన తన భార్యతో కలిసి పొగాకు, తమలపాకులు, సున్నం, కాసు తదితర వస్తువులను కొనుగోలు చేసి సంత రోజుల్లో పరిగి, మన్నెగూడ, చౌదరిగూడ, రంగాపురంలో విక్రయిస్తున్నాడు. రోజూ ఊళ్లు తిరుగుతూ విక్రయాలు జరిగితేనే పూట గడిచేది. తమకు చేనేత రంగం తప్ప ఇతర పనులు రాకపోవడం వల్లనే ఇలా బతకాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొగాకు, కాసు తమలపాకులు అమ్ముతున్న అంజయ్య, లక్ష్మమ్మ

Sunday Special

నూలు వడకక.. పూట గడవక!

చేయూత కరువైన చేనేత బతుకులు

ఒకప్పుడు వైభవం.. నేడు కూటి కోసం తిప్పలు

సంతల్లో పొగాకు, తమలపాకుల వ్యాపారం

చౌదరిగూడలో చేనేత కార్మికుల బతుకు ఛిద్రం

షాద్‌నగర్/ చౌదరిగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు చేనేత వైభవాన్ని కళ్లకు కట్టారు.. ఇక్కడ తయారు చేసిన వస్త్రాల నైపుణ్యాన్ని అంగళ్లు పెట్టి మరీ ప్రపంచానికి పరిచయం చేశారు చౌదరిగూడ చేనేత కార్మికులు. ఇదంతా గతం.. ఇక వర్తమానంలోకి వస్తే కూటి కోసం కోటి తిప్పలు పడుతూ ఉపాధి వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వలసబోతున్నారు. నాడు చేనేత వైభవానికి ప్రతీకగా నిలిచిన చౌదరిగూడ మండల కేంద్రం నేడు వెలవెలబోతోంది. స్థానిక చేనేత కార్మికుల కన్నీటి గాథలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

చౌదరిగూడ మండల కేంద్రం, ఇంద్రానగర్ జంట గ్రామాలు. ఈ గ్రామాల్లో ఎక్కువ శాతం మందికి చేనేత వృత్తే ఆధారం. ఈ రెండు గ్రామాల్లో సుమారు 250 కుటుంబాలు ఈ వృత్తి మీద ఆధారపడ్డాయి. అద్భుతమైన పట్టు చీరలు, పట్టు పంచెలు, ఇతర వస్త్రాలు, పట్టు కండువాలను కొనుగోలు చేయడానికి రాష్ట్ర రాజధాని

మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వం ఆదుకోవాలి

చేనేత వస్త్రాలతో కళకళలాడే మా ఇల్లు.. నేడు జీవనాధారం లేక వెలవెలబోతుంది. నా భర్తతో కలిసి వస్త్రాలను తయారు చేసేవాళ్లం. అప్పట్లోనే ఖర్చులు పోను రోజుకు రూ. వెయ్యి నుంచి రూ.1500 సంపాదించే వాళ్లం. కానీ ప్రస్తుతం జీవనాధారం లేక బతుకు భారంగా మారింది. మా పిల్లలకు కూడా మంచి విద్యను అందించలేక పోయాం. పనిలేక కూలీలుగా మారినం. ప్రభుత్వం కనికరించి చేనేత కార్మికులను ఆదుకోవాలి.

\- చంద్రమ్మ
చేనేత కార్మికురాలు

జిల్లాలో నేడు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

చేవెళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడంపై చేవెళ్లలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమానికి రైతులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పట్నంలో దసరా సమ్మేళనం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 19: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బొంగులూరు ప్రమిద కన్వెన్షన్‌లో నియోజకవర్గ కార్యకర్తల దసరా సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం పది గంటలకు జరిగే ఈ సమ్మేళనంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

శబరిమల మహా పాదయాత్ర

కందుకూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తగూడ గ్రామం నుంచి ఆదివారం శబరిమల మహా పాదయాత్రను ప్రారంభించనున్నట్లు గురుస్వాములు ఎస్ మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎస్ శేఖర్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, సాయిలు తెలిపారు. సుమారు ఎనిమిది మంది అయ్యప్ప భక్తులు ఉదయం 9గంటలకు గ్రామంలోని రాజరాజేశ్వరి దేవాలయం ఆవరణలో ఇరుముడి మహాపడి పూజలు నిర్వహించి, కాలినడకన శబరిమల యాత్రకు బయల్దేరి వెళ్తారని తెలిపారు. అయ్యప్ప భక్తులు పూజకు హాజరుకావాలని కోరారు.

బండలపై బెండ సాగు

సాగులో వినూత్న ఆలోచన

బండలపై మట్టిని పేర్చి బెండతోట

ఆదర్శంగా నిలుస్తున్న రైతు శేఖర్

ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన ఓ రైతు వినూత్నంగా బెండ సాగు చేపట్టి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆదిభట్ల నుంచి కొంగరకలాన్ వెళ్లే దారిలో తనకున్న అరెకరం భూమిలో వేసిన బెండ తోట దారిన పోయే వారిని ఎంతగానో ఆకట్టుకుంటుంది. సదరు రైతు చేసిన ఆలోచనకు గ్రామస్తులు మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నారు. అరెకరం పొలంలో వేసిన బెండ తోటకు ఇంత బిల్డప్ అవసరమా? అని అనుకుంటున్నారా? అతను ఏం చేశాడో ఈ కథనంలో తెలుసుకుందాం.

ఆదిభట్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

7



బండరాళ్లతో నింపిన గుంతపై సాగు చేసిన బెండ తోట

అప్పుల కుప్పగా తెలంగాణ

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దివాలా



మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

- సీఎం రేవంత్ కృషితో ఇప్పుడిప్పుడే కోలుకుంటుంది
- అతి త్వరలో హైదరాబాద్-బీజాపూర్ హైవే విస్తరణ పనులు
- పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాకు సాగునీరు
- కలెక్టరేట్‌ను రాజేంద్రనగర్‌కు తరలిస్తాం
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందన్నారు. శనివారం చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని స్థానిక కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్

మిగతా 8వ పేజీలో...

ఆదర్శ మున్సిపాలిటీ దిశగా ఆదిభట్ల

మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి 8



ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ దోపిడీ

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 7

బాలికల పరిరక్షణ అందరి బాధ్యత

సీడీపీవో శాంతిరేఖ



మాట్లాడుతున్న సీడీపీవో శాంతిరేఖ

ఆమనగల్లు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, సాధికారితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని ఐసీడీఎస్ సీడీపీవో శాంతి రేఖ అన్నారు. బాలికల పరిరక్షణ, విద్య, అందరి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం మహిళాభివృద్ధి, శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి పథకం, మహిళా సాధికారితపై అవగాహన కల్పించారు. కేజీబీవీ ఎస్‌వో పద్మజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీడీపీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని అన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకొని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ మంజుల, శ్రీకాంత్, ఐసీపీఎస్ ప్రతినిధి ప్రశాంతి, ఎస్‌వో పద్మజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరళాదేవి, అనిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వీవోఏలకు షోకాజ్ నోటీసులు



వీవోఏలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేశారని ఫరూఖ్‌నగర్ మండలంలోని 25 మంది మహిళా గ్రామ సహాయకులకు నోటీసులు జారీచేశారు. దీనిపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం ఎమ్మెల్యే శంకర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఆందోళనకు చేపట్టారు. 20 రోజుల కింద లఖ్‌పతి పథకం కింద మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించారు. వీటికి సంబంధించి సభ్యులు చేస్తున్న వ్యాపారం, లాభాలు తదితర విషయాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో వీవోఏలు నిర్లక్ష్యం చేశారని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఏపీఎం నగేష్ తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అన్యాయంగా షోకాజ్ నోటీలు ఇచ్చారని వీవోఏలు ఆరోపిస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడి, ఏపీఎంను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు.

దారి పొడవునా అవస్థలే..

- రహదారులపై అడ్డగోలుగా భారీ వాహనాల పార్కింగ్
- మరో వాహనం వెళ్లలేని పరిస్థితి
- తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకోని అధికారులు

కొత్తూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల పరిధిలోని జాతీయ రహదారితో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన భారీ వాహనాలను అడ్డగోలుగా నిలుపుతున్నారు. కనీసం ఇంకో వాహనం వెళ్లడానికి వీలు లేకుండా పార్కింగ్ చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని తిమ్మాపూర్, పెంజర్ల, ఇన్మునర్వ గ్రామాల శివారులో అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలకు నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. లోడింగ్, అన్‌లోడింగ్‌కు సమయం పడుతుండటంతో వాహనాలను గంటల తరబడి రోడ్డుపై నిలుపుతున్నారు. హైదరాబాద్-బెంగుళూరు వెళ్లే 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఇదే మాదిరిగా నిలుపుతుండటంతో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారులపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఇన్ముల్‌నర్వ-పెంజర్ల రోడ్డుపై ఇరువైపులా నిలిపిన భారీ వాహనాలు

విద్యార్థులకు జెర్సీల అందజేత



జెర్సీలు ధరించిన విద్యార్థులతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ షాద్‌నగర్ జోన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెర్సీలను అందజేశారు. ఆదివారం తుక్కుగూడ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఖోఖో పోటీలు నిర్వహిస్తారు. ఈ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు శనివారం క్యాంప్ కార్యాలయంలో ఎంఈవో మనోహర్‌తో కలిసి క్రీడా దుస్తులను అందించారు. వారికి రవాణా సౌకర్యం కూడా కల్పించారు.

ఆలయాలకు విరాళాల వెల్లువ



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న ఆకుల వెంకటేశ్

షాద్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ పరిధి చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయం, ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీమాత ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరుచేసిందని ఎమ్మెల్యే శంకర్ శనివారం తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయానికి రూ.50లక్షలు వెచ్చిస్తామన్నారు. మ్యాచింగ్ గ్రాంట్ ఫండ్ కింద షాద్‌నగర్‌కు చెందిన ఆకుల వెంకటేష్ దంపతులు తమ కుమారుడి జ్ఞాపకార్థం రూ.10లక్షలు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎలికట్ట భవానీమాత ఆలయానికి ఎమ్మెల్యే రూ.5లక్షల విరాళమిచ్చారు. షాద్‌నగర్‌లోని వేంకటేశ్వరాలయంలో గరుడ, హనుమ ప్రాకార గోపురాలకు టీడీపీ నేత చల్లా వెంకటేశ్వర రెడ్డి దంపతులు రూ.లక్షను మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులుకు అందజేశారు. మొగిలిగిద్దలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తుడు అనుమారి వెంకటయ్య రూ.51వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిమార్గంలో నడిస్తేనే మనిషికి శక్తి వస్తుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

డ్రోన్‌తో పంటపై రసాయనాల పిచికారి

● పది నిమిషాల్లో ఎకరంలో స్ప్రే!



కంది పంటపై మందు పిచికారి చేస్తున్న డ్రోన్

బొంరాస్‌పేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దుద్యాలలో ఓ రైతు తన కంది పంటకు శనివారం డ్రోన్‌తో రసాయన మందు పిచికారి చేశాడు. దీంతో స్ప్రే చేస్తే ఎకరానికి ఒక బిందె నీరు మాత్రమే సరిపోతుంది. 10నిమిషాల్లో ఎకరా పొలానికి పిచికారి చేస్తుందని రైతు తెలిపాడు. ఎకరా పిచికారికి రూ.450 ఖర్చు అవుతుందన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వికారాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): తైక్వాండోతో ఆత్మరక్షణ, ఆరోగ్య పరిరక్షణ కలుగుతాయని, అలాగే ఈ క్రీడతో ఉద్యోగపరమైన రిజర్వేషన్ కూడా లభిస్తుందని తైక్వాండో జిల్లా అసోసియేషన్ చైర్మన్ రాఘవన్‌నాయక్ తెలిపారు. శనివారం వికారాబాద్‌లోని తేజఫంక్షన్ హాల్‌లో 68వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్ 14, 17 బాలబాలికలకు పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. పోటీల్లో సుధీర్, సురేందర్‌సింగ్, గోపాలకృష్ణ జడ్జీలుగా వ్యవహరించారు.

చిత్తడిగా మార్కెట్ దారి

షాద్‌నగర్ రూరల్ అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని షాహీ గార్డెన్ ఎదుట రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతారు. ఈ రోడ్డు చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. గతంలో వేసిన సీసీ లేచిపోయి మట్టి రోడ్డులా మారింది. వర్షం పడితే రోడ్డు బురదమయం అవుతోంది. దుకాణాల వద్ద బురద ఉండటంతో కొనుగోలుదారుల రావడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈ రోడ్డును అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలంటున్నారు. కుళ్లిన కూరగాయలు రోడ్డుపైనే పారబోస్తుండటంతో అటువైపు వెళ్లేవారికి దుర్వాసన వస్తోంది. మున్సిపల్ అధికారులు ఇప్పటి కైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


చైర్‌పర్సన్‌తో సమావేశమైన టౌన్ ప్లానింగ్ ఆర్జేడీ నర్సింహారెడ్డి

మాస్టర్ ప్లాన్ కోసం డ్రోన్ సర్వే

తాండూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వికారాబాద్, తాండూరు మున్సిపాలిటీల్లో తిరిగి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసుకునేలా డ్రోన్ సర్వే చేస్తున్నామని హైదారాబాద్ రేంజ్‌టౌన్ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి చెప్పారు. శనివారం తాండూరులో అక్రమ నిర్మాణాలపై చేపట్టే డ్రోన్‌సర్వేపై పరిశీలనకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న డ్రోన్ సర్వే చేసి, ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను దశలవారీగా క్రమబద్ధీకరిస్తామన్నారు. ఆర్జేడీ వెంట రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు. కాగా తాండూరులో అక్రమ నిర్మాణాలపై తాను ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు స్పందించ లేదని చైర్‌పర్సన్ స్వప్న ఆర్జేడీతో అన్నారు. చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్జేడీతో స్వప్న ఆవేదన వ్యక్తం చేశారు. తాను తాండూరులోనే ఉంటానని, అక్రమ నిర్మాణాలపై పట్టించుకోకుంటే ఎలా అని ప్రశ్నించారు. నాలాలాపై అక్రమ నిర్మాణాలను తొలగించడం లేదన్నారు. సమావేశంలో కమిషనర్ విక్రమసింహారెడ్డి, టీపీవో అధికారులు పవన్, కరుణాకార్ ఉన్నారు.

ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ దోపిడీ


విలేఖరులతో మాట్లాడుతున్న జి.జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో కాంగ్రెస్ దోపిడీకి తెరలేపిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆరోపించారు. గతంలో చేపట్టిన పనులకు కమీషన్లు ఇస్తేనే బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో ఇళ్ల కూల్చుతూ పేదలను రోడ్డుపాలు చేస్తోందన్నారు. ఆమనగల్లులోని కల్యాణి గార్డెన్‌లో శనివారం జైపాల్‌యాదవ్ విలేఖరులతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో భారీగా నిధులు కేటాయించి ప్రజాధనాన్ని దోచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారన్నారు. 6 గ్యారంటీల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాగ్రహాన్ని మరిపింపజేయాలనే హైడ్రాపేరుతో మోసానికి తెర లేపారన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఎవరి కోసం మారుస్తున్నారని ప్రశ్నించారు. కల్వకుర్తికి సాగునీటిని అందించిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. కేసీఆర్ పాలనలో కేఎల్ఐ డి-82 కాల్వ నిర్మాణానికి నిధులిచ్చి పనులు పూర్తి చేయిస్తే.. కాంగ్రెస్ నాయకులు తమ ఘనతే అని చెప్పుకోవడం హాస్యాస్పదం అన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నిస్వార్థ సేవలందించానని, రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశానని జైపాల్ అన్నారు. తన రాజకీయ జీవితంలో చిన్న తప్పు చేశానని నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రాజకీయ అవివేకి, అజ్ఞాని అని జైపాల్‌యాదవ్ నిప్పులు చెరిగారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా చేసిన కేసీఆర్‌ను కసిరెడ్డి విమర్శించడం తగదన్నారు. విద్యా వ్యాపారి అయిన కసిరెడ్డి జీవితం గురించి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. బీఆర్ఎస్‌లో గ్రూపు రాజకీయాలు చేసి పార్టీ ఓడేలా చేశారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ అనురాధ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, పార్టీ పట్టణాధ్యక్షుడు పత్యానాయక్, నిరంజన్‌గౌడ్, రఘు, సాయిలు, గుత్తి బాలస్వామి, శ్రీను, శంకర్, రమేశ్‌నాయక్, సుభాష్, సైదులు, గణేశ్‌నాయక్, రమేశ్ నాయక్, క్రిశీను తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



నందిగామ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరం అని, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు అన్నారు. మండల కేంద్రానికి చెందిన దాసరి రవి కొన్నిరోజులుగా అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఈమేరకు ఆయనకు మంజూరైన రూ.34వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం నర్సింలు స్థానిక నాయకులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, పిట్టల రాములుతో కలసి లబ్ధిదారుడికి అందజేశారు.

బండలపై బెండ సాగు

- వినూత్న ఆలోచనతో ముందుకు
- బండరాళ్లపై మట్టిని పేర్చి సాగుచేసిన బెండ తోట
- ఆదర్శంగా నిలుస్తున్న ఆదిభట్ల రైతు


మొదట బండ రాళ్లతో నింపిన గుంత


రాళ్లపై పోసిన ఎర్రమట్టిలో సాగవుతున్న బెండ పంట

ఆదిభట్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన యువరైతు కోరే శేఖర్‌కు ఆదిభట్ల గ్రామానికి ఆనుకోని అర ఎకరం పొలం ఉంది. కాని గతంలో ఇసుక ఫిల్టర్లు నడుస్తున్న సమయంలో ఇసుకను తోడటంతో దాదాపు 20 ఫీట్ల మేరకు గుంత పడింది. అలాగే పక్కనే కుంట ఉండటంతో ఈయనకున్న అర ఎకరం భూమి కూడా కుంటలా మారిపోయింది. ఉన్నదే అర ఎకరం అదీ పెద్ద గుంతలా మారిపోవడంతో మొదట ఆందోళన చెందాడు. వెంటనే తేరుకొని అందరి లాగా దిగాలు పడకుండా కొత్తగా ఆలోచించాడు. తనకు తెలిసిన ఓ వ్యక్తి వెంచర్ చేస్తున్న క్రమంలో బండరాళ్లు తొలగిస్తున్నాడు. వాటిని తీసుకువచ్చి ఆ గుంతను పూడ్చడం చేశాడు. గుంత రోడ్డు లేవల్‌కు రావడంతో బండరాళ్లపై ఎర్రమట్టిని పరిచాడు. అంతే అంతే ఆ గుంత కాస్తా అర ఎకరం వ్యవసాయ భూమిగా మారింది. వెంటనే బోరు వేసి బెండ తోట సాగు చేశాడు. ఇప్పటి వరకు ఉన్న గుంత కాస్తా ఆదిభట్ల మేయిన్ రోడ్డులో ఖరీదైన వ్యవసాయ భూమిగా మారిపోయింది.

టిప్పర్‌తో బండల తరలింపు

నాకు ఉన్న అర ఎకరం భూమిలో ఫిల్టర్ ఇసుక కోసం మట్టిని తవ్వారు. దాంతో ఆ ప్రాంతమంతా పెద్ద గుంతలా మారిపోయింది. దాంతో ఉన్న భూమి పోయిందని బాధ పడకుండా దానిపై మళ్లీ మట్టి నింపి చూద్దాం అనుకున్న. మాకు తెలిసిన వ్యక్తి రావిరాల దగ్గర వెంచర్‌లో బండలు తీస్తున్నడని తెలిసింది. టిప్పరుతో బండలు తరలించి ఇరవై ఫీట్లు ఉన్న గుంతను రాళ్లతో నింపాను. తర్వాత పైనుంచి మట్టి నింపాను. అనంతరం బోరు వేసి బెండ తోట వేసిన. మొక్కలు బాగానే వచ్చాయి. ఇప్పుడు నా భూమి నాకు వచ్చింది. వ్యవసాయం నడుస్తోంది అంటూ సంతోషంగా చెబుతున్నాడు రైతు శేఖర్.

బైక్‌కు డబ్బులు ఇవ్వలేదని..

మేడ్చల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మనవడు నానమ్మను చంపేశాడు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఘటన జరిగింది. బాలమ్మ (62) తన కొడుకు మధుతో కలిసి మేడ్చల్ మండలం రావల్‌కోల్ గ్రామంలో నివాసం ఉంటోంది. మధుకు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ప్రశాంత్(21) ఉన్నాడు. ప్రశాంత్ వ్యసనాలకు అలవాటు పడి జులాయిగా తిరిగేవాడు. డబ్బులు అవసరం ఉన్నప్పుడల్లా నానమ్మతో గొడవ పడి చేతికందినంత తీసుకునేవాడు. దీంతో, గ్రామంలో బాలమ్మ పేరిట ఉన్న కొద్దిపాటి ఆస్తిని సంవత్సరం క్రితం అమ్మారు. మిగతా డబ్బును చిన్న మనవరాలి పెళ్లి కోసం బ్యాంకులో దాచారు. అయితే, ప్రశాంత్ తన వాటా కింద రావాల్సిన డబ్బుతో బైక్ ఇప్పించాలని తరచూ నానమ్మతో గొడవ పడేవాడు. దీంతో, శుక్రవారం ఇద్దరు అక్కలు(బాలమ్మ మనవరాళ్లు) ఇంటికి వచ్చి ప్రశాంత్‌ను మందలించి వెళ్లారు. బాలమ్మపై కోపం పెంచుకున్న ప్రశాంత్ శుక్రవారం రాత్రి మద్యం తాగివచ్చి బాలమ్మతో గొడవ పడ్డారు. ఈ క్రమంలో బాలమ్మ తలను ఇంట్లో గోడకేసి బాదాడు. తలకు బలమైన గాయం కావడంతో వృద్ధురాలు అక్కడే చనిపోయింది. పోలీసులు ప్రశాంత్‌ను అదుపులో తీసుకున్నారు.

కుల గణనకు కసరత్తు

- రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు బాధ్యత
- ఆర్థిక, సామాజికాంశాలపై లెక్కలు


2011 కుల గణన ముసాయిదా

తాండూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కుల గణనకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. శాఖల వారీగా అధికారులు, సిబ్బంది, ఉన్నతాధికారుల వివరాలు కోరుతున్నారు. మండల పరిషత్, రెవెన్యూ, విద్యాశాఖ, మున్సిపల్, ఐసీడీఎస్, మెప్మా, ఐకేపీ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కంటే పైనున్న అధికారుల సెన్సెస్ సేకరిస్తున్నారు. తాండూరు డివిజన్‌లో తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీలు, ఏడు మండలాలు ఉన్నాయి. బీసీ కమిషన్ ఆధ్వర్యంలో కులగణన చేపట్టారు. ఈ నెల 9న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 60 రోజుల్లోనే కులగణన పూర్తికి యంత్రాగం కసరత్తు చేస్తోంది. తాజా కులగణనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనాభా వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు ఎదురు చూస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కులగణనను రెండు నెలల్లో పూర్తి చేస్తారు.

రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు బాధ్యత

కులగణన బాధ్యతను రెవెన్యూ, పట్టణాల్లో మున్సిపల్ శాఖలకు అప్పగించే అవకాశాలున్నాయి. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ, ఎంఈవోలకు, మున్సిపల్ కమిషనర్లకు అప్పగించే అవకాశాలున్నాయి. పట్టణాల్లో వార్డు ఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిల్లో విధులు నిర్వర్తిస్తారు. కాగా 13ఏళ్ల తర్వాత గణన చేస్తున్నారు. 2011లో సామాజిక ఆర్థిక కులగణన నిర్వహించారు. అప్పట్లో కుటుంబ సభ్యుల, ఆరు రకాల ఇతర వివరాలను సేకరించారు. వచ్చే డిసెంబరులో తాజా గణన పూర్తి చేస్తారు.

తాండూరు డివిజన్ జనాభా వివరాలు

మండలం/మున్సిపాలిటీ	గ్రామాలు/వార్డులు	జనాభా(2011లో)	ఓటర్ల సంఖ్య
తాండూరు మున్సిపాలిటీ	36 వార్డులు	71,008	71,331
కొడంగల్ మున్సిపాలిటీ	12వార్డులు	14,294	9,998
తాండూరు మండలం	37	1,18,776	45,5678
పెద్దేముల్ మండలం	29	51,893	39,807
యాలాల మండలం	36	45,295	37,511
బషీరాబాద్ మండలం	32	43,562	39,817
బొంరాస్‌పేట్ మండలం	16	52,211	44,371
కొడంగల్ మండలం	19	39,372	31,997
దౌల్తాబాద్ మండలం	25	51,411	43,393

మొత్తం 260 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్ వార్డులు ఉన్నాయి





తాండూరులో సీపీఎం మహాసభల సందర్భంగా ర్యాలీలో కార్యకర్తలు

ఎరుపెక్కిన తాండూరు

తాండూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): సీపీఎం వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభలు తాండూరులో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు పట్టణంలోని బస్టాండ్ నుంచి ఆర్యవైశ్య పంక్షన్ హాల్ వరకు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రయ్య పార్టీ జెండాను ఎగురవేశారు. మహాసభలకు ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్‌రాములు, జగదీష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 11ఏళ్లలో పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింతా ధనవంతులుగా తయారయ్యారన్నారు. ప్రధాని మోదీ పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నారని, నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. ఎర్ర జెండా ఆధ్వర్యంలో మోడీ మత్మోన్మాద , ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వ్యవహరిస్తుందన్నారు. రాబోయే రోజులు ఎర్ర జెండావేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మహిపాల్, వెంకటయ్య, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బోరు బావిలోకి మురుగు నీరు



నవాబుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి ట్యాంకుల ద్వారా వృథాగా వెళ్తున్న నీరు బోరు బావిలోకి వెళ్తుందని గ్రామస్థులు అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శ్వేతను వివరణ కోరగా మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రజ్యోతి ఉదయం ఫొటోలు తీయడంతో సాయంత్రం పంచాయతీ అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు.




సీఎం నుంచి మెడల్, ప్రశంసా పత్రం అందుకుంటున్న రాజు

పోలీస్ డ్యూటీ మీట్‌లో దుద్యాల వాసికి అవార్డు

బొంరాస్‌పేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ డ్యూటీ మీట్-2024 సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసు అధికారులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో డీజీపీ కార్యాలయంలో ఐటీ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దుద్యాల మండల కేంద్రానికి చెందిన మునగాల రాజు 98 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. శనివారం పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన మెడల్‌తో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు.

అట్టహాసంగా కళా ఉత్సవ్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో న్యాయ నిర్ణేతలు

వికారాబాద్ అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ప్రారంభించారు. ఈ టీంలలో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 150మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను చాటారు. నృత్యం(క్లాసికల్-ట్రెడీషనల్), సంగీతం, ఏకపాత్రాభినయం, చిత్రలేఖనం, నాటిక, కథలు చెప్పడం అనే ఆరు అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామ్ మస్తాన్, న్యాయ నిర్ణేతలు శివ జ్యోతి, ప్రమంతి, శ్రీనివాస్, శ్రీకాంత్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి దగ్గరలో ఉన్నా..

రాతమారని కడ్తాల

- ఎనిమిదేళ్లుగా నిర్మాణం పూర్తికాని మండల పరిషత్ కార్యాలయ భవనం
- నిధుల్లేక మధ్యలో నిలిచిన పనులు
- డెయిరీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమెప్పుడో?
- హామీలకే పరిమితమైన జూనియర్ కాలేజీ, బస్టాండ్, ఆస్పత్రుల నిర్మాణం
- అద్దె కార్యాలయాల్లో వసతుల్లేక ఇబ్బందులు



శిథిలావస్థకు చేరిన కడ్తాలలోని పాల శీతలీకరణ కేంద్ర భవనం

కడ్తాల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 2016లో కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో కడ్తాల మండల కేంద్రమైంది. మండల కేంద్రంతో సౌకర్యాలు కలిగి ఇబ్బందులు తొలుగుతాయని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. 8ఏళ్లయినా మండల కార్యాలయాల భవనాలు, అనుగుణ వసతులు కల్పించలేదు. దీంతో 24 పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నెలకొన్న సమస్యలవీ

- కడ్తాల మండల పరిషత్ నిర్మాణానికి రూ.50 లక్ష లు అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 సెప్టె ంబరు 8న అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాప న చేశారు. నిధులున్నంత వరకు కాంట్రాక్టర్ పను లు చేపట్టాడు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ నిర్మించారు. అవ సరమైన నిధులు రాక, ప్రజాప్రతినిధుల చొరవ లేక భవ న నిర్మాణ అసంపూర్తిగానే మిగిలిపోయింది.
- కడ్తాల పాల శీతలీకరణ కేంద్రం వద్ద డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ 2022లో నిర్మించిన దుకాణ సముదాయం ప్రారంభించక షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉంది. దీనిని ప్రారంభించాలని ఇటీవల నాయకులు డెయిరీ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చారు. డెయిరీ చిల్లింగ్ సెరంట్ భవనం సైతం శిథిలావస్థకు చేరింది. విజయ డెయిరీ సకాలంలో బిల్లులు చెల్లించక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి సైతం సొంత భవనం లేదు.
- కడ్తాలలో 2023 సెప్టెంబరు 8న మహిళా సమా ఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించ లేదు. ఎస్‌డీఎఫ్ నుంచి రూ.20లక్షలు కేటాయించినా పనులు చేయలేదు. దీంతో సమావేశాలకు భవనంలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.
- కడ్తాలలో బస్టాండ్ లేదు. బస్సుల కోసం రోడ్లపైనే వేచి ఉంటున్నారు. ఎండ, వానకు ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ హాస్టళ్లలోనూ విద్యార్థులకు సరైన వసతుల్లేవు. కడ్తాలలో ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేక యాచారంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



కడ్తాల మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కరించాలి. కొత్త మండల ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి. అసంపూర్తిగా నిలిచిపోయిన మండల పరిషత్ భవన నిర్మాణానికి అదనంగా రూ. కోటి మంజూరు చేసి పనులు పూర్తిచేయాలి. మంజూరైన మహిళా సమాఖ్య, పీహెచ్‌సీ భవనాల నిర్మాణం చేపట్టాలి. పాలశీతలీకరణ కేంద్రం ఎదుట నిర్మించిన దుకాణ సముదాయాన్ని ప్రారంభించాలి. కడ్తాలలో కళాశాల, బస్టాండ్, నిర్మాణాలు వెంటనే చేపట్టాలి.

- దశరథ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ, కడ్తాల్

ఎవరూ పట్టించుకోవడం లేదు



2016లో కడ్తాలను మండల కేంద్రం చేసినా పాలనాపరంగా నేటికీ ప్రజలకు అవసరమైన తగిన వసతులు కల్పించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు తొలగ లేదు. హైదరా బాద్‌కు 50 కిలోమీటర్ల లోపే ఉన్నా కడ్తాల అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురవుతోంది. మండల అభివృద్ధికి రాజకీయాలు పక్కనబెట్టి అందరూ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించాలి. అసంపూర్తి ఉన్న భవనాలు పూర్తిచేయాలి.

- దోనాదుల మహేశ్, కడ్తాల్

అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి చొరవ



కడ్తాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నిధులు రాబట్టేలా కృషిచేస్తున్నాం. కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయ భవనాలను ఇప్పటికే ప్రారంభించాం. మండల పరిషత్ భవనానికి అవసరమైన నిధులు కేటాయించి నిర్మాణం పూర్తి చేస్తాం. కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు.

- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీ, కడ్తాల్

బంగారం దొంగ.. మేనేజరే


బంగారం కోసం మణప్పురం బ్యాంక్‌కు వచ్చిన తాకట్టుపెట్టిన వారు

వికారాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : '3కేజీల బంగారంతో పరారీ ?.. ఫైనాన్స్ సంస్థ మేనేజర్ పనేనని గుసగుసలు' అంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆ కంపెనీ ప్రతినిధులు స్పందించారు. ఆంధ్రజ్యోతి ముందుగా చెప్పినట్లుగానే మేనేజరే ఈ పని చేశారన్నట్లుగానే మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మేనేజర్ విశాల్ అసలు దొంగ అని నిర్ధారణ అయింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త చక్కర్లు కొట్టడంతో నిజాలు బయట పడ్డాయి. ఉదయం నుంచి బంగారం తాకట్టు పెట్టిన వారు బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. తమ బంగారం ఉందా? లేదా అంటూ అక్కడ ఉన్న సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈక్రమంలో కొందరూ లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా బ్యాంకు సిబ్బంది అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వికారాబాద్ సీఐ భీమ్ కుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంస్థ ఆడిట్ అధికారిగా వచ్చిన శంకర్ రెడ్డి అనే వ్యక్తి మాట్లాడుతూ. మేనేజర్ విశాల్ బంగారం తీసుకెళ్లిన మాట వాస్తవమని బంగారం పోయిన ప్రతి ఒక్కరికి సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నారు. విశాల్ గురించి పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాజేసిన బంగారం విలువ రూ.2.10కోట్లు

బ్యాంక్‌లో నుంచి మేనేజర్ విశాల్ 63 ప్యాకెట్లను దొంగలించినట్లుగా పోలీసులు గుర్తించారు. అందులో 2.600 కిలోల బంగారం ఉండగా దాని విలువ రూ.2.10 కోట్లుగా ఉంటుందని స్పష్టమైంది. అయితే బ్యాక్ మేనేజర్ విశాల్‌తో పాటు అందులో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్‌కు కలిపి రెండు తాళాలు బంగారం లాకర్‌వి ఉండాల్సి ఉంటుంది. అక్కడ అసిస్టెంట్ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండడంతో అందులో పనిచేసే మరో కింది స్థాయి సిబ్బందికి తాళం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. దీన్ని అదునుగా చేసుకున్న మేనేజర్ ఆ వ్యక్తికి సంబంధం లేకుండా బంగారం కాజేసి 18వ తేదీ నుంచి విధులకు రావడం లేదని గుర్తించారు. మేనేజర్ కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి కాగా మణప్పురంలో గత నాలుగైదు సంవత్సరాలుగా పనిచేస్తూ వచ్చారు. సంవత్సరన్నర కాలంగా వికారాబాద్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీస్ అధికారులు, సంస్థ సిబ్బంది 16వ తేదీ బంగారం బయటకు తీసుకెళ్లినట్లుగా అనుమానిస్తున్నట్లుగా తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమ్‌కుమార్ తెలిపారు.

'కేటీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు సరికాదు'

వికారాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్ నేవీ రాడార్ కోసం కోట్లలో తీసుకున్నాడంటూ అసెంబ్లీ స్పీకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పీకర్ పదవిలో ఉండి ఇలాంటి తప్పుడు రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. 12లక్షల వరకు చెట్లు నరికి వేసి పచ్చని అడవిని నాశనం చేస్తున్నారని సమాజ హితం కోసం ప్రజల పక్షాన కేటీఆర్ పోరాటం చేస్తున్నందున ఈ రాష్ట్ర ప్రభుత్వం జీర్ణించుకోలేక స్పీకర్ ద్వారా ఇలాంటి తప్పుడు ఆరోపణలకు తెర లేపడం దారుణమన్నారు. స్పీకర్ తన వ్యాఖ్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.



డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు వినతిపత్రం ఇస్తున్న చంద్రశేఖర్, ఆనంద్

సహకార సంఘానికి ఐదు కోట్ల నిధులివ్వండి

కందుకూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల సహకార సంఘం ద్వారా రైతులకు పంట, ఎల్టీ రుణాలు ఇవ్వడానికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ పొట్టి ఆనంద్‌లు శనివారం డీసీసీబీ చైర్మన్ సత్తయ్యకు వినతిపత్రం ఇచ్చారు. నగరంలోని డీసీసీబీ కార్యాలయంలో సత్తయ్యను కలిసి వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. రైతులకు కొత్తగా పంటరుణం ఇవ్వడానికి రూ.2కోట్లు, ఎల్టీ రుణాలు ఇవ్వడానికి రూ.3కోట్లు మంజూరు చేయాలని కోరగా సత్తయ్య సానుకూలంగా స్పం దించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందజేత

షాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని మన్‌మర్రి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్‌మౌర్య అన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శశిప్రకాష్ విద్యార్థులకు ప్యాడ్లు, నోట్‌బుక్స్, పెన్నులు అందించారు.

రోడ్డుపైనే ధాన్యం ఆరబోత

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కేశంపేట మండలంలో పలువురు మృత్యువాత

రైతులకు అవగాహన కల్పించాలంటున్న ప్రజలు

కేశంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్లపై ధాన్యం ఆరబోస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఆరబోయడానికి రోడ్లను వినియోగించుకుంటున్నారు. వరి ధాన్యం, జొన్న, మొక్కజొన్న పంటలను ఆరబోయడానికి సమీపంలోని రోడ్లను కల్లాలుగా వాడుకుంటున్నారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలు చేసి రాత్రిళ్లు అక్కడే ఉంచుతున్నారు. రాత్రి సమయంలో కుప్పలు గమనించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది మండల పరిధిలోని సంతాపూర్ సమీపంలో రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రాయి తగలడంతో కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళా కూలీ మృతి చెందగా, మిగతా కూలీలు గాయపడ్డారు. కొత్తపేట-మంగళగూడెం మార్గంలో మొక్కజొన్న ఆరబోసిన చోట ట్రాక్టర్ ట్రాలీ పెట్టడంతో రాత్రి సమయంలో బైక్ ఢీకొట్టగా కోళ్లపడకల్ గ్రామానికి చెందిన భరత్‌కుమార్ అనే యువకుడు దుర్మరణం చెందాడు. అలాగే సంగెం సమీపంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కనబడక బైక్‌ను ధాన్యం మీదికి వెళ్లడంతో పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. కాగా, ప్రస్తుతం మండలంలో మొక్కజొన్న పంట నూర్పిడీలు చేస్తున్నారు. పంటను ఆరబోయడానికి రోడ్లను ఎంచుకుంటున్నారు. మండలంలో ప్రధానంగా సంగెం-వేముల్‌నర్వ, ఇప్పలపల్లి-కొండారెడ్డిపల్లి, భైర్కాన్‌పల్లి-అల్వాల, సంతాపూర్-కొత్తపేట మార్గంలో ధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబోస్తున్నారు. రోడ్లపై నూర్పిడీలు చేయకుండా, ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కల్పించాలని వాహనదారులు, ప్రయాణికులు పోలీసులను కోరుతున్నారు.



వేముల్‌నర్వ- సంగెం రోడ్డులో మొక్కజొన్నను ఆరబోసిన రైతులు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?



ధాన్యం రోడ్లపై ఆరబోస్తుండడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని సమయాల్లో ప్రాణాలు కూడా పోతున్నాయి. గతేడాది రోడ్డుపై ధాన్యం కుప్పల పక్కన ఉన్న రాయి తగిలి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడగా ఓ మహిళా మృతిచెందింది. రోడ్లపై పంటలను ఆరబెట్టకుండా, నూర్పిడీలు చేపట్టకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు, సంతాపూర్

రాత్రివేళ ప్రయాణమంటేనే భయమేస్తోంది



బైక్‌పై నిత్యం పనులు ముగించుకొని రాత్రి సమయాల్లో ఇంటికి వెళ్తుంటా. ఈ సీజన్‌లో రాత్రివేళ బైక్ నడపాలంటేనే భయమేస్తోంది. రోడ్లపై ధాన్యం కుప్పల మీద నల్లటి కవర్ కప్పడంతో రాత్రి సమయంతో బీటీ రోడ్డు మాదిరిగానే కనిపిస్తోంది. వాహనదారులు గమనించక పోతే ప్రమాదానికి గురికావాల్సిందే. రోడ్లపై కల్లాలు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలి.

- కుమ్మరి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్, సంగెం

క్రైం కార్నర్

వాగులోపడి వ్యక్తి మృతి



జంగయ్య(ఫైల్)

కేశంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాగులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదిరేకులకు చెందిన కొండకళ్ల జంగయ్య(46) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని వాగు వద్దకు స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కంప చెట్లకు చిక్కుకొని వాగులోనే మృతిచెందాడు. శనివారం ఉదయం మృతదేహం వాగులో తేలడంతో మృతుడు జంగయ్య భార్య గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కొత్తూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌నకు చెందిన పట్నం మణిరత్నం(35) అదృశ్యమైనట్లు ఎస్సై జి. శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 15న అరుణాచలం యాత్రకు వెళ్లిన మణి రత్నం నేటి వరకు కూడా ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. మణిరత్నం కోసం కుటుంబసభ్యులు గాలింపులు జరిపినా.. ఫలితం లేకపోయిందన్నా రు. మణిరత్నం తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శనివారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712568270 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

ఆదర్శ మున్సిపాలిటీ దిశగా ఆదిభట్ల

మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

65 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



ఒకటో వార్డులో రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు ప్రాధాన్యతా క్రమంలో దశలవారిగా పరిష్కరిస్తూ ఆదిభట్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు మున్సిపాలిటీ పరిధిలోని 1, 13, 14 వార్డులలో కౌన్సిలర్లు లావణ్య పాండురంగారెడ్డి, అర్చనా రాంరెడ్డి లతో కలిసి శనివారం రూ.65లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు ఆయన ప్రారంభించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. ప్రజల సహకారంతో ఆదిభట్లను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దును న్నట్లు తెలిపారు. కమిషనర్ బాలకృష్ణ, డీఈ కుమార్, మాజీ సర్పంచ్‌లు పొట్టి అయిలయ్య, గణేష్‌గౌడ్, నాయకులు పైళ్ల శ్రీనివాసరెడ్డి, గౌని బాల్ రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూలు వడకక.. పూట గడవక!



వృథాగా పడి ఉన్న సట్టర్ మగ్గం

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్‌తో సహా ఇతర ప్రాంతాల వస్త్ర వ్యాపారులు వచ్చి ఇక్కడి నేతన్నలు నేసిన వస్త్రాలను కొనుగోలు చేసేవారు. దాంతో చౌదరిగూడ మండలం చేనేత వృత్తి ప్రాధాన్యతను సంతరించుకుంది.

కరువైన ప్రోత్సాహం

కాలక్రమేణా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడం, నూతన వస్త్ర సాంప్రదాయాలు మార్కెట్లోకి రావడంతో చేనేత పరిశ్రమ చతికిలపడింది. దాంతో చేనేత కార్మికులంతా కూలి పనుల కోసం స్వరాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లారు. ఉన్న ఊరును వదిలి ఎక్కడికీ వెళ్లలేక ఉన్న కొన్ని కుటుంబాలు మాత్రం ఇక్కడే కూలీలుగా మారారు. ఒకప్పుడు కేవలం 200 మీటర్ల దారం నేయడానికి రూ.800 ఖర్చు వచ్చేదని, అందులో తమకు రూ.200 మిగిలేదని, అలా రోజుకు కనీసం రూ.400 నుంచి రూ.800 వరకు సంపాదించేవారమని చెబుతున్నారు. కానీ, ప్రస్తుతం రోజంతా కష్టపడినా కూడా కనీసం రూ.500 కూలి కూడా రావడం కష్టంగా మారిందని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గోడకు తగిలించిన చేనేత మగ్గం

కుటుంబ పోషణ భారమై..



కొంగరి నారాయణ, చేనేత కార్మికుడు

ఈ చేనేత కార్మికుడి పేరు కొంగరి నారాయణ. చౌదరిగూడ గ్రామం. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు. చేనేత వస్త్రాలను తయారు చేయడంలో ఆయనది అందవేసిన చెయ్యి. పట్టు చీరలు, వస్త్రాల తయారీతో రోజుకు రూ.1,500 వరకు సంపాదిస్తూ తన కుటుంబంతో ఆనందంగా ఉండేవాడు. కాలక్రమేణా మార్కెట్లోకి రెడీమేడ్ దుస్తులు రావడం, కార్పొరేట్ సంస్థలు కూడా వస్త్ర వ్యాపారంలోకి అడుగు పెట్టడంతో చేనేత రంగం చతికిలపడింది. వస్త్రాలు నేసినా ఎవరూ కొనడానికి ముందుకు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దాంతో చేనేత మగ్గాలను అటకెక్కించి తన కుటుంబంతో సహా అందరూ కూలి పనులకు వెళ్తున్నారు. పిల్లల చదువులు కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూలి పనులు కూడా అంతంత మాత్రంగానే దొరుకుతుండటంతో జీవనం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సహకారం అందించి చేనేత కార్మికులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కృష్ణారెడ్డికి కసిరెడ్డి కృతజ్ఞతలు



కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెల్దండ మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన గోలి రాజశేఖర్‌రెడ్డి లివర్ శస్త్రచికిత్సకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కలకొండ మాజీ సర్పంచ్ కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కృష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక న్యాయమే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆమనగల్లు/మాడ్గుల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల మండలం అవురుపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించి భవనం నిర్మించాలని, కురుమ కులస్థుల భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామ నాయకులు, పలు సంఘాల నేతలు శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అన్నివర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మాజీ సర్పంచ్ గౌని నారాయణగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నాగిళ్ల శ్రీరాములు, నాయకులు గౌని యాదయ్యగౌడ్, పోలె లక్ష్మయ్య, రవీందర్, శేఖర్, కొమురయ్య, కృష్ణయ్య, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాడ్గుల మండలం గిరికొత్తపల్లి, నల్లచెర్వు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను నాయకులు, గ్రామస్థులు కోరారు. గిరికొత్తపల్లికి నైట్‌హాల్ బస్సును పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు. అక్రమణకు గురైన రంగసముద్రం చెరువును కాపాడాలని, నల్లచెర్వులోని ఎస్సీ కాలనీలో 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరగా ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. నల్లచెర్వు-అజిలాపూర్ మధ్య పెద్దవాగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు కోరారు. నల్లచెర్వుకు చెందిన ఎమ్మె పర్వతాలుకు మంజూరైన రూ.37,500 సీఎంఆర్ఎఫ్ చెక్కు. ఎమ్మెల్యే అందజేశారు.

నిధుల కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

తలకొండపల్లి : మండల పరిధిలోని చంద్రధన ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి నిధులు కేటాయించాలని గ్రామ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజేందర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 22న రైతు మహా ధర్నా

కడ్తాల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ, రైతుబంధు పెట్టుబడి సాయం, రైతుబీమా, విజయ పాడి రైతులకు పాలబిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 22న కడ్తాలలో రైతు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి రైతులను, ప్రజలను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు చేపడుతున్న మహాధర్నాలో రైతులు, కూలీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ నివాసంలో శనివారం డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పరమేశ్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రూ.2లక్షల లోపు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి రైతులను మోసగించిందని ఆరోపించారు. నేటికి సగం మంది రైతులకు కూడా మాఫీ జరగలేదన్నారు. నాయకులు జోగు వీరయ్య, లాయక్‌అలీ, సాయిలు, మంగళపల్లి నర్సింహ, గంప శ్రీను, లాల్‌కోట నర్సింహగౌడ్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

షాద్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని భగీరథ కాలనీకి చెందిన న్యాయవాది గోదా మాధవులు యాదవ్ సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాలనీలోని రోడ్లు గుంతలమయం కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఆయన శనివారం కాలనీలో రోడ్లపై గుంతలను మట్టితో పూడ్పించారు. కాలనీవాసులు ఆయన్ను అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

చౌదరిగూడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి ఆకాశ్ నాయక్ అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్ తండాలోని పాఠశాలను విద్యార్థి సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే శంకర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

మోదీతోనే దేశ ప్రగతి



చేవెళ్ల : సభ్యత్వం చేయిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతి ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్, సాయిరాం, శివ, ఇంద్రసేనారెడ్డి, అశోక్, శ్రీనివాస్, జయసింహరెడ్డి, బండారి శేఖర్‌రెడ్డి, గణేశ్, చాకలి శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, టింకు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే దేశాభ్యున్నతి

తలకొండపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశాభ్యున్నతి సాధ్యమని బీజేపీ జిల్లా కార్యదర్శి శానమోని పాండు ప్రసాద్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తో విసిగిపోయిన ప్రజలు బీజేపీని ఆదరిస్తూ పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా స్వీకరిస్తున్నారని అన్నారు. తలకొండపల్లి మండలం మొదక్‌పల్లి గ్రామంలో వికసిత్ భారత్-2024లో భాగంగా శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాండు ప్రసాద్, బక్కి కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సభ్యత్వ నమోదు ప్రారంభించారు.

మధుసూదన్‌రెడ్డికి నాయకుల శుభాకాంక్షలు



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

షాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని శనివారం షాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పినట్లు నాయకులు పేర్కొన్నారు. చైర్మన్‌ను కలిసినవారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు లింగం, గౌరవాధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి మాసయ్య, నాయకులు జనార్దన్, శ్రీనివాస్, గౌరీశ్వర్, మల్లేష్, వెంకటయ్య, చంద్రయ్య, యాదగిరి, ఆనందం, రవి తదితరులు ఉన్నారు.

సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

షాద్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది మాదిరిగానే యాదవ్‌లు నిర్వహించే సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలని యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ హోటల్లో ఉత్సవ కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సదర్ ఉత్సవాలను నిర్వహించి యాదవుల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల యాదవ సంఘం నాయకులు ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించి 24న పట్టణంలోని మల్లికార్జున మినీఫంక్షన్‌హాల్లో తుది సమావేశం ఏర్పాట్లపై నిర్ణయం తీసుకుంటామన్నారు. గున్న భీమయ్య యాదవ్, బక్కన్న యాదవ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, రఘునాథ్ యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సురేశ్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న ఉప్పల

తలకొండపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉండి ఆదుకుంటుందని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. నాయకులు కార్యకర్తలు ఎవరు అధైర్య పడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తర్నికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌గౌడ్‌ను శనివారం ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నాయకులు సత్యనారాయణ, వెంకటయ్య, గణేశ్, ఖాజా, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

మహేశ్వరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని, ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా విఫలమైందని వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సహకార్యదర్శి చింతల వెంకన్న డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా శనివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో తుక్కుగూడలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకూ హిందూ దేవాలయాలపై వరుస దాడులు జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించలేదన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడి ఇస్లామిక్ తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై వరుస దాడులు చేస్తున్న టెర్రరిస్టులను పట్టుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఆలయాలపై దాడులను ఆపకపోతే హిందువుల సత్తా చాటుతామన్నారు. రాఘవేందర్, రాజు, ఈశ్వర్, వినోద్, రామ్‌రెడ్డి, అనీల్, మహేష్, శ్రీరామ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

అప్పుల కుప్పగా తెలంగాణ

(5వ పేజీ తరువాయి)

బి.రాములు, పాలక వర్గం సభ్యులు స్పీకర్ సమక్షంలో మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడుతానని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్ల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి మరో రూ.50 కోట్లు విడుదల కానున్నాయని స్పష్టం చేశారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని త్వరలోనే రాజేంద్రనగర్‌కు తరలించేలా సీఎం రేవంత్‌తో చర్చిస్తామన్నారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపితే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మాజీ జెడ్పీటీసీ మాలతి, నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, జనార్దన్‌రెడ్డి, యాదగిరి, పట్నం రాంరెడ్డి, బల్వంత్‌రెడ్డి, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, పాండు, నర్సింలు, వీరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, కుమ్మరి చెన్నయ్య, రాములు, బండారు శైలజ, దేవర సమతారెడ్డి, మహమ్మద్ రియాజ్, అశ్వక్, సుజాత, మహేందర్ పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కొందరు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. నాయకులు వేదికపైకి వెళ్లే సమయంలో జనం తోసుకున్నారు. ఈ సమయంలో నాయకుల జేబుల నుంచి డబ్బులు కొట్టేశారు.



స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గం

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



హరీష్‌రావుతో అవినాష్‌రెడ్డి, చాంద్‌పాషా తదితరులు

షాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ చాంద్‌పాషా, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్‌లు నగరంలో ఆయన నివాసంలో శనివారం హరీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని హరీష్‌రావు తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. దర్శన్, యాదయ్య, రమేష్‌యాదవ్, అవిలాష్‌గౌడ్ తదితరులు హరీష్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఆలయాల నిర్మాణంలో భాగస్వాములవ్వాలి



చెక్కు ఇస్తున్న వెంకటసాయి డెవలపర్స్ యాజమాన్యం

చేవెళ్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆలయం నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని పామెన మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి తెలిపారు. పామెనలో వీరభద్రస్వామి ఆలయం నిర్మిస్తున్నారు. శనివారం వెంకటసాయి డెవలపర్స్ యాజమాన్యం రూ.3లక్షల1,116 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు గోపాల్‌రెడ్డి సమక్షంలో ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, సీనియర్ నాయకులు బుచ్చప్ప, కొయ్యడ రాములు, బాబు, నాయకులు వరుణ్‌రెడ్డి, వినోద్‌కుమార్, గురోత్తం, రవికుమార్, అంజయ్య పాల్గొన్నారు.